నర్సరీ రైతులకు మినహాయింపు ఇవ్వాలి

కడియం: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలు, డీజీల్ లూజ్ అమ్మకాలపై నిషేధం విధించిన విషయం విధితమే. ఈ నిషేధం నర్సరీ రైతులకు పెనుభారంగా మారిందని, సర్ ఆర్ధర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు మాట్లాడుతూ నర్సరీలకు నిత్యం నీళ్ల తడులు కావాలని, విద్యుత్ శాఖ వారు 7 గంటలు మాత్రమే నర్సరీ మోటార్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. మిగిలిన సమయం డీజిల్ ఇంజన్‌పై ఆధారపడి నీళ్ల తడులు పెడుతున్నామన్నారు. పెట్రోల్ బంకుల్లో విడిగా అమ్మకాలు లేక నర్సరీ రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. దీనిపైకలెక్టర్ సానుకూలంగా స్పందించి నర్సరీ రైతులకు డీజిల్, పెట్రోలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి గాధ నాగేశ్వరరావు, డైరెక్టర్ వడ్లమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- కౌంటింగ్‌కు రాజకీయపార్టీలు సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఓట్ల లెక్కింపు సందర్భంలో కౌంటింగ్ కేంద్రాల్లో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినా, ఉల్లంఘనలకు పాల్పడినా బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, ఈ మేరకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం ఇవిఎం ఓట్లకు సంబంధించి ఒక్కోటేబుల్ వద్ద ఒక

సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రతినిధులు

సూపర్‌వైజర్, సహాయకులు, మైక్రో అబ్జర్వర్, పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్, సహాయకులు, మైక్రో అబ్జర్వర్, ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపు కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్ వైజర్, సహాయకులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు సహాయకులుగా ఒక సహాయకుడు, ఇద్దరు మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయిన తదుపరి మాత్రమే ఐదు ఇవిఎంలకు చెందిన వివి పాట్స్‌లోని ఓట్లను లెక్కిస్తామన్నారు. వాటిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు.

కౌంటింగ్ కోసం అధికారులు సిబ్బందిని మూడు దశల్లో సాంకేతిక పరమైన విధానంలో ర్యాండమైజెషన్ చేస్తామని తెలిపారు. కౌంటింగ్ టేబుల్స్ సంఖ్య మేరకు కౌంటింగ్ ఏజెంట్స్‌ను అనుమతిస్తామని, ఆ మేరకు ఐడి కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. నేర చరిత్ర కలిగిన, బైండోవర్ కేసులు నమోదైన వ్యక్తులను కౌంటింగ్ ఏజెంట్స్‌గా నియామకం జరగకుండా అభ్యర్థులు రాజకీయ పార్టీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థి తన తరపున ఒక ఏజెంట్‌ను కౌంటింగ్ కేంద్రంలోని అనుమతిస్తామని, ఇద్దరిలో ఎవరో ఒక్కరు మాత్రమే ఉండడానికి అవకాశం ఉందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు అరగంట ముందు ప్రారంభమవుతుందన్నారు. అనంతరం ఇవిఎంలలో పోలైన ఓట్లను లెక్కించనున్నట్లు తెలిపారు. రౌండ్ వారీగా లెక్కింపు పూర్తి అయిన తర్వాత ఫలితాలు వివరాల కాపీలను ఏజెంట్లకు ఇస్తామని, వాటిని ఫారం 17సితో నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

బాణసంచా వినియోగంచడంపై నిషేధం ఉందన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, కౌంటింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడరదని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత రౌండ్ వారీగా ఆయా యూనిట్స్ సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్‌లల్లో భద్రపరుస్తామన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఎసిపి అనిల్‌కుమార్, పార్లమెంటు నియోజక వర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, అభ్యర్థులు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే ఆత్మహత్యాయత్నం

పోలవరం నిర్వాసితులందరికీ ప్యాకేజీ అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పోలవరం నిర్వాసితుడు ఉండమట్ల సీతారామయ్య ఆత్మహత్యాయత్నం ఘటన పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. విషయం తెలుసుకున్న ఆయన సీతారామయ్య కుమారునితో మాట్లాడారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీతారామయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 73 ఏళ్ల వయస్సులో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి మనస్థాపానికి గురైన సీతారామయ్య చేసేదిలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఉన్న భూమిని, ఇంటిని ప్రాజెక్టు కోసం అర్పించిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలకు కనీసం కనికరం లేకుండా పోయిందన్నారు. సీతారామయ్యలాంటి నిర్వాసితులు ఇంకా చాలా మంది ఉన్నారన్నారు. కొంత మంది వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. నిర్వాసితులందరికీ ఇప్పటికైనా ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ పోలవరం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులపై లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితులను మాత్రం పట్టించుకోవట్లేదన్నారు. తక్షణం నిర్వాసితులందరికీ ప్యాకేజీ అందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

ఎపిపిఎస్‌సి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్న డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు జిల్లాలో 960 మంది అభ్యర్థులు శనివారం పరీక్షలకు హాజరు కానున్నారని కలెక్టరేట్ పరిపాలనాధికారి బివిఎస్.రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో ఎపిపిఎస్‌సి పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రామారావు మాట్లాడారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షల కోసం రాజమండ్రిలో రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ కళాశాలలో సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయము 7.30 గంటల నుంచి ఉదయం 8.15 గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. గ్రేస్ పిరియడ్ 15 నిమిషాలు ఉంటుందని, తదుపరి పరీక్ష హాల్లోకి అభ్యర్థులను అనుమతించబోమన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, పేజర్ లేదా ఇంట్రాక్ట్ ప్రోగ్రామింగ్ చేయగల ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సరఫరా, పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్, ఎఎం.మాధవీలత మాట్లాడుతూ అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటుగా ఒక ఒరిజినల్ ఫోటో ఐడితో హాజరు కావాలన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు పరీక్ష సమయానికి కంటే ఒక గంట ముందు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కె.అనిల్‌కుమార్, డిహెచ్‌ఎంఒ పి.జాన్సన్‌రాజు, ఎస్ఐ ఎ.కలాం, డిఇఇ ఎస్.దేవయ్య, లైజన్ ఆఫీసర్ టి.దివాకర్ పాల్గొన్నారు.

ఆసరా సొమ్ములు కాజేశారంటూ

యూనియన్ బ్యాంకు వద్ద డ్వాక్రా మహిళలు నిరసన

ప్రజాశక్తి- పెరవలి

మండలం కానూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల సిఎలు కానూరు యూనియన్ బ్యాంక్ సిబ్బందితో చేతులు కలిపి ఆసరా సొమ్ములను కాజేశారని డ్వాక్రా మహిళలు శుక్రవారం కానూరు యూనియన్ బ్యాంకు బ్రాంచ్ వద్ద నిరసన తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో సబ్ మేనేజర్ మునేశ్వరరావుకు వినతి పత్రం అందించేదకు ప్రయత్నించారు. తాను అంతా విన్నానని, డ్వాక్రా సిఎలు రాత పూర్వకంగా వినతిపత్రం ఇస్తే ఎవరి ఖాతాల్లో వేశామో చెప్పగలమని ఆయన తెలిపారు. దీంతో మహిళలు ఆందోళన చేపట్టారు మండలంలో డ్వాక్రా సంఘాల పనితీరు చాలా ఘోరంగా ఉందన్నారు. చనిపోయిన వారి పేర్లు కూడా కొన్ని సంఘాల్లో కొనసాగుతున్నాయన్నారు. చనిపోయిన వారి ఖాతాల్లోనూ డబ్బులు వేస్తున్నారన్నారు. ఇలాంటి ఖాతాల నుంచి, అవగాహన లేని వారి సొమ్ములను కాజేస్తున్నారన్నారు. వీరికి కానూరు గ్రామానికి చెందిన న్యాయవాది తణుకు బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి, బహుజన సమాజ్ పార్టీ నాయకుడు వెన్నపు సుధాకర్ సంఘీభావం తెలిపారు. దీనిపై సబ్ మేనేజర్ మునేశ్వరరావు మాట్లాడుతూ తాము డ్వాక్రా సిఎలను పిలిచి విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. కానూరు గ్రామంలో అమూల్య గ్రూపుకు సంబంధించి నలుగురు సభ్యులకు ఇవ్వాల్సిన సొమ్ములు వేరే వారి ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారన్నారు. ఇందులో సిఎలు, బ్యాంకు సిబ్బంది హస్తం ఉందని ఆరోపించారు. వెన్నపు సుధాకర్ మాట్లాడుతూ విషయాన్ని ఎపిఎం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించానన్నారు. ఆడిట్ కారణంగా ఆయన అందుబాటులో లేరన్నారు. సిఎలు చెప్పిన వారి ఖాతాలకే బ్యాంక్ సిబ్బంది కూడా సొమ్ములు జమ చేశారన్నారు. మండల వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్త్రీనిధి నిధుల గోల్‌మాల్‌పై జిల్లా స్థాయి అధికారులు విచారణ చేశారని, ఇప్పటివరకు ఆ నిధులను కూడా జమ చేయించలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు వెన్నపు సుందరకుమారి, రాజేశ్వరి, అమ్మాజీ, భావన నాగమణి, బంగారమ్మ, మామిడిపల్లి లక్ష్మి, బి.నాగమణి, బత్తుల వెంకటరత్నం, ఎం.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న డ్వాక్రా మహిళలు

తాడిపర్రులో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎన్నికల లెక్కింపు సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని తాడిపర్రులో నిడదవోలు సిఐ వి.జానకిరామయ్య ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్ సమయంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా అధికారులకు సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. ఈ తనిఖీల్లో సరియైన పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు, ఆయా వాహనదారులు సరైన పత్రాలు చూపిస్తే వారి వాహనాలను తిరిగి అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ఎస్ఐ పి.అప్పారావు, రూరల్ ఎస్ఐ రమేష్, పెరవలి ఎస్ఐ మూర్తి, ఉండ్రాజవరం ఎఎస్ఐ కె.రామకృష్ణ, సిబ్బంది కె.జయరాం, కె.రమేష్, ఆర్‌కె.సత్యనారాయణ, వై.రాజు, వై.నాగేశ్వరరావు, వై.మోహన్, ఎం.ముత్యాలు, వి.బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

ప్రజాశక్తి - గోపాలపురం

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని గుంటూరు పొగాకు బోర్డ్ చైర్మన్ సిహెచ్.యశ్వంత్ కుమార్ అన్నారు. పొగాకు కొనుగోలు ప్రారంభమై 60 రోజులు పూర్తయిన సందర్భంగా గోపాలపురం, దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం 1,2 వేలం కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలపురం పొగాకు రైతులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. బోర్డు సూచించిన పరిమితి దాటిన పొగాకు పంటకు పెనాల్టీ విధించకుండా కొనుగోళ్లు జరపాలని కోరారు. బోర్డు సూచించిన పరిమితి పొగాకు కొనుగోళ్లు పూర్తయిన తర్వాత బోర్డు నిలుపుదల చేయకుండా అదనంగా పండించిన పొగాకును కొనేందుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. ఎస్ఒపి ఎరువు 50 కేజీలు రూ.3,600 ధర ఉందని, ఇది భారంగా మారిందని తెలపారు. కేంద్రంతో మాట్లాడి ఎస్ఒపి ఎరువుకు సబ్సిడీపై ఇప్పించాలని కోరారు. పొగాకు పంటలో సరికొత్త విత్తనాలు 350, 353 రకాలు ఐటిసి ద్వారా అందించాలన్నారు. ఈ మేలు రకం విత్తనాల ద్వారా ఎకరా పంటకు రెండు క్వింటాలు అధిక దిగుబడి లభిస్తుందన్నారు. ఈ మేలురక విత్తనాలను సిటిఆర్ఐ వారి అనుమతులు ఇప్పించాలని రైతుకు విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా లో-గ్రేడ్, గ్రీన్ పొగాకుకు ధరన పెంచాలన్నారు. దీనిపై చైర్మన్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలను పరిష్కరిం చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పొగాకు కొనుగోలు ప్రక్రియలో పాల్గొని పొగాకు ధరలను పరిశీలించారు.

రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, ఎఎస్ఒ అమల్ డి.శ్యామ్ మాట్లాడుతూ గోపాలపురం పొగాకు బోర్డు పరిధిలో 2,286 మంది రైతులు ఉన్నారన్నారు. 2,780 బేరన్‌లు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. 4,800 హెక్టార్ల విస్తీర్ణంలో పొగాకు పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదికి బోర్డు నుంచి 9.9 మిలియన్ కేజీల పొగాకు కొనేందుకు అనుమతి ఇవ్వగా, రైతులు పండించిన పంట 12.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామన్నారు. మొత్తం పొగాకు కంపెనీలు 30 ఉండగా అందులో 20 కంపెనీలు కొనుగోళ్లలో పాల్గొన్నట్లు తెలిపారు. 1061 పొగాకు బేళ్ల(1లక్ష 8 వేల 172 కేజీల పొగాకు) తీసుకురాగా 877 బేళ్లు కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభంలో అత్యధిక ధర కేజీ రూ.240తో ప్రారంభం కాగా శుక్రవారం నాటికి నాణ్యమైన పొగాకు కు ఒక కేజీ రూ.331 అత్యధిక ధర పలకగా రూ.235 అత్యల్ప ధర లభించినట్లు తెలిపారు. సరాసరిని కేజీకి రూ.318 ధర లభించిందన్నారు. ఇప్పటివరకు 4 మిలియన్ కేజీలు పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇంకా 8 మిలియన్ కేజీలు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పండించిన పంటకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. అంతర్జాతీయంగా మార్కెట్‌లో ఏర్పడిన కొరత కారణంగా పొగాకు డిమాండ్ ఏర్పడి మునుపెన్నడూ లేనివిధంగా మంచి గిట్టుబాటు ధర లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు ఇల్లూరి రాంబాబు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, నందమూరి సత్యనారాయణ, కొర్లపాటి అన్నవరం, కూసం రామ్మోహన్‌రెడ్డి, రైతులు గద్దె శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్, గడ భాస్కరరావు, ప్రత్తిపాటి సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

గోపాలపురం కొనుగోలు కేంద్రంలో పొగాకును పరిశీలిస్తున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నాగంపల్లిలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు కాలి బూడిదైంది. నాగంపల్లికి చెందిన ములపర్తి వెంకటేశులు, భార్య, కుమార్తె, ముగ్గురు మనవళ్లతో తాటాకు ఇంట్లో నివశిస్తున్నాడు. శుక్రవారం గ్యాస్ పొయ్యిమీద వంట చేస్తుండగా ఒక్కసారిగా పొయ్యి నుంచి మంటలు చెలరేగాయి. ఇవి తాటాకులను తాకడంతో ఇల్లు అంటుకుంది. ఒక్కసారిగా మంటలు పెరగడంతో ఇంట్లో వారంతా ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వెంకటేశులు కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడింది. సీతానగరం ఆర్ఐ లక్ష్మి, విఆర్ఒ, విఆర్ఎలతో కలిసి కాలిపోయిన ఇంటిని పరిశీలించి, నష్టం అంచనా వేశారు. సుమారు రూ.2 లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించిందని తెలిపారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా 25 కేజీల బియ్యాన్ని ఆర్ఐ లక్ష్మి అందించారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నన్నయ్య యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కి పోస్టల్ బ్యాలెట్‌ను తరలించారు. 3,033 పోస్టల్ బ్యాలెట్ పత్రాలను న్యాక్ భవనంలోని రూరల్ నియోజక వర్గ తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ నుంచి నన్నయ్య యూనివర్సిటీ ప్రాంగణానికి తరలించినట్లు జెసి తేజ్ భరత్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో వాటినీ పోలీసు ఎస్కార్ట్ మధ్య తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, డిటి సుధీర్, పోలీసులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఏజెంట్లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లను తరలిస్తున్న సిబ్బంది

16 రౌండ్లలో ఓట్లు లెక్కింపు

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి 16 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేస్తామని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి అన్నారు. ఎంఎల్ఎ ఎన్నికల్లో పోటీలో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓట్ల లెక్కింపులో అనుసరించు విధానం, నిబంధనలపై అవగాహనా కార్యక్రమం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఒ మాట్లాడారు. నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు, ట్యాబ్లోషన్ టేబుల్స్ రెండు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 15 రౌండ్లు పూర్తిగా, 16వ రౌండ్‌లో ఐదారు టేబుల్స్‌లో లెక్కింపుతో మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. అనతరం ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఓట్ల లెక్కింపునకు వస్తున్న రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌటింగ్ రోజు ఏడు గంటలకు లెక్కింపు కేంద్రాలకు రావాలన్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక పార్టీ తరపున ఒక ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వారు కూడా కౌంటింగ్ టేబుల్‌కు ఆవలి వైపున ఏర్పాటు చేసిన మెస్ వెలుపల నుంచి మాత్రమే ఓట్ల లెక్కింపును పరిశీలించుకోవచ్చన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి వెళ్లే ఏజెంట్లకు సబంధించి జూన్ ఒకటో తేదీ లోగా దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని రాజకీయపార్టీల వారికి సూచించారు. ఈ సమావేశంలో ఉత్తర మండల డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



స్కానింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పిహెచ్‌సిల పరిధిలో నిర్వహించే స్కానింగ్ పరీక్షలను గర్భిణులు వినియోగించుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచిత స్కానింగ్ జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి గర్భిణులకు అందేలా చూడాలన్నారు. నవజాత శిశువుల ఆరోగ్యం స్థితికి సంబంధించి ఆరోగ్యాన్ని నిర్ధారించడానికి, దాని నాణ్యతను చూడడానికి ప్రసవానంతర సంరక్షణ కోసం అల్ట్రా సోనోగ్రఫీ స్కానింగ్ ద్వారా తెలుసుకొని సరైన వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. పుట్టుకతో వచ్చే వైకల్యాలు బహుళ గర్భాలు, ప్లేసెంట్ ప్రీవియం, గర్భధారణ కాలాన్ని నిర్ధారించడంలో ఈ స్కానింగ్‌లు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. పుట్టుకతో వచ్చే వైకల్యాల నిర్ధారణ, ముందస్తు సమాచారాన్ని అందిస్తుందన్నారు. గర్భధారణ సమయంలో పుట్టినప్పుడు తగిన చికిత్స చేయడం, నవజాత శిశువు సంరక్షణలో ప్రత్యేక స్కాన్ల ద్వారా తక్షణమే రిఫర్ చేయడానికి నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతగానో సహాయపడుతుందన్నారు. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ మల్టిపుల్ జస్టేషన్, ప్లేసెంటా ప్రీవియ వంటి కొన్ని పరిస్థితులు ప్రాణాంతకమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. స్కానింగ్‌లో వీటిని ముందుగానే గుర్తిస్తే చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రీ నేటల్ కేర్‌లో ముఖ్యంగా 12 వారాలు దాటిన తర్వాత ఎన్‌టి స్కాన్ ద్వారా న్యూరల్ డిఫెక్ట్స్‌ను కనుగొనే అవకాశం ఉందన్నారు. 18 నుంచి 22 వారాల వరకు టిఫాస్కాన్ చేయించుకోవాలన్నారు. వీటిని ఉచితంగా రాయల్ హాస్పిటల్, జిఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఆరోగ్యశ్రీ లాగిన్ ద్వారా రిఫరల్ స్లిప్ తీసుకుని చేయించే వీలుందన్నారు. వీటి ద్వారా పిండం అసాధారణ పరిస్థితిలను గుర్తించడానికి వీలవుతుందనానరు. పుట్టుకతో వచ్చే లోపాల గల పిల్లల సంఖ్య భారతదేశంలో అత్యధికంగా ఉందన్నారు. దాదాపు 33 మంది శిశువుల్లో ఒకరికి ఇటువంటి లోపాలు ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి సంవత్సరం జనాభాలో 3.2 మిలియన్ల జనాభా లోపాల సంబంధిత వైఖల్యాలకు కారణం అవుతుందన్నారు. భారతదేశంలో హైరిస్క్ గర్భాల ప్రభాల్యం దాదాపు 15 శాతం ఉండగా డెలివరీకి ముందు స్కాన్ చేయించుకునే వారు నాలుగు శాతం మాత్రమే ఉంటున్నారని తెలియజేశారు. ప్రసూతి మరియు పెరినటల్ మరణాలను తగ్గించడం కోసం సాధారణ స్కానింగ్‌లను విధిగా రెండుసార్లు చేయించుకోవాలన్నారు. ఈ స్కానింగ్‌లను ఆరోగ్యశ్రీ ద్వారా ఎంపెనల్ అయినటువంటి ఆసుపత్రుల్లో గర్భిణులకు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ విషయాలను వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే గర్భిణులకు స్కానింగ్ చేయించేలా కృషి చేయాలన్నారు. పిహెచ్‌సి స్థాయిలో ఈ మేరకు సమీక్ష సమావేశాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ మౌనిక, నిశాంత్, డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, జిల్లా గణాంక అధికారి కుమారస్వామి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మెయిన్ రోడ్ బస్టాండ్ సెంటర్, శ్రీకాకతీయ కళ్యాణ మండపం సెంటర్ వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. రిటైర్డ్ ఎంపిడిఒ ఆతుకూరి రామరావు, మంగాదేవి దంపతుల మనవరాలు కుమారి కుషితచాందిని పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు మజ్జిగను వితరణ చేశారు. దాతలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

సిఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -దేవరపల్లి

శుక్రవారం దేవరపల్లి మండలం లక్ష్మీపురం, దుద్దుకూరు గ్రామాల్లో దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామంలో సరైన పత్రాలు లేని పది బైకులను స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. సారాను విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేశామన్నారు. 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే దేవరపల్లిలో 25 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని దేవరపల్లి ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మాజీ సర్పంచ్ ఆత్మహత్య

ఎంఎల్ఎ టిక్కెట్ రాలేదని సూసైడ్‌నోట్

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని పారుపాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గాడి నూకరాజేశ్వరరావు శుక్రవారం గ్రామంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల మేరకు ఏ పార్టీ నుంచి తనకు ఎంఎల్ఎ టిక్కెట్ దక్కకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నూక రాజేశ్వరరావు 2006లో సర్పంచ్‌గా పనిచేశారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఎంఎల్ఎ టిక్కెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డారు. అలాగే 2009లో పిఆర్‌పి నుంచి, 2024లో వైసిపి నుంచి టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డారు.

విద్యుదాఘాతంతో ఆవుల మృత్యువాత

ప్రజాశక్తి- ముమ్మిడివరం

పొలాల్లో మేస్తున్న రెండు ఆవులు శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ముమ్మిడివరం పోలీసులు తెలిపారు. మండలంలోని కొత్తలంక పంచాయతీ పరిధిలో గంగుల శంకర్ అతని చిన్నాన్న గంగుల గోవిందుకు చెందిన రెండు ఆవులను శుక్రవారం కాలువ గట్టు సమీపంలో పొలాల్లో మేస్తుండగా విద్యుత్ స్తంభం దగ్గరలోని ఒక విద్యుత్ తీగ తెగి వాటిపై పడింది. విద్యుదాఘాతానికి రెండు ఆవులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఆవులతో వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ సాగిస్తున్నామని, వాటిమృత్యువాతతో జీవనోపాధి కోల్పోయామని బాధితులు వాపోతున్నారు. ఈ మేరకు ఎస్ఐ డి. సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

326 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

సుంకం చెల్లించని 326 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరావు తెలిపారు. బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. సంచుల్లో నిల్వ చేసిన సుంకం చెల్లించని 326 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామానికి చెందిన పోతాబత్తుల కాసుబాబుపై కేసు నమోదు చేశామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.34,302 ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది జి.మణికంఠ, కనక రాజు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానాం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు వేల లీటర్లతో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు గ్రామ సమీపములో ట్యాంకర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్యాంకర్‌లో 4వేల లీటర్ల డీజిల్‌ను గుర్తించారు. ఆ డీజిల్‌ను, డ్రైవర్ గోవల సుబ్బారావును అదుపులోకి తీసుకున్నారు. యానాంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో లీటరు రూ.84కు కొనుగోలు చేసి మోటార్, పైపు సహాయంతో ఆయిల్ ట్యాంకర్ వాహనాన్ని వేరొక వాహనంలోకి లోడు చేస్తుండగా పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ ట్యాంకర్ కమ్ టాటా ఏస్ వాహనం యజమాని అడ్డాల వీరవెంకటసత్యనారాయణ ఆ డీజిల్‌ను తాళ్లరేవుకు రవాణా చేసి అక్కడ చేపలు, రొయ్యల చెరువుల మోటార్ ఇంజిన్లకు లీటరుకు రూ.88 లకు విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తున్న డీజిల్ విలువ సుమారు రూ.8.39లక్షలు ఉంటుందన్నారు. ఈమేరకు కేసులు నమోదు చేశామని ఎంఎస్ఒ ప్రసన్న తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, డిఎస్ఒ ప్రసాద్, సిఎస్‌డిటి లక్ష్మీప్రసన్న, ఎఎస్ఒ రామణలక్ష్మీదేవి, లోవరాజు, శివ పాల్గొన్నారు. పట్టుబడిన ఆయిల్ ట్యాంకర్ తాళ్లరేవులోని శ్రీవీరసాయినాగేంద్ర ఏజెన్సీస్ హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద భద్రపరిచినట్లు తెలిపారు. నిందితులను జెసి కోర్టులో హాజరుపరుస్తామని ఎంఎస్ఒ తెలిపారు.

కాంట్రాక్ట్ వర్కర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమంలో అక్రమంగా తొలగించిన 80 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం తశీసిల్దార్ యలకుర్తి రంగారావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ జీడిపిక్కల పరిశ్రమ యాజమాన్యం అడ్డదారిలో యంత్రాలను తరలించుకోవడానికి ప్రయత్నించగా కార్మికుల అడ్డుకున్నారన్నారు. అప్పటినుండి పరిశ్రమ యాజమాన్యం వివిధ సాకులు చూపి 80 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. జిల్లాలో మిగిలిన జీడిపిక్కల ఫ్యాక్టరీలు లాభాలలో నడుస్తుంటే చిన్నింపేట పరిశ్రమకు మాత్రం ఎందుకు నష్టాలు వస్తాయని ఆయన ప్రశ్నించారు. నష్టాలను సాకుగా చూపి కార్మికులను తొలగించడం తగదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయిలో కార్మికులకు ఉపాధి కల్పిస్తూ పరిశ్రమ కొనసాగించాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎన్.సాల్మన్‌రాజు, ఎం.కృష్ణమూర్తి, బి.నాని, సురేష్, నరేంద్ర ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా సత్యప్రభ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ పుట్టినరోజును కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమెకు శుభాకాంక్షలు తెలిపి భారీ కేక్ కట్ చేయించారు. అనంతరం రాజన్న యువసేన సభ్యులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాజన్న ఆశయ సాధనకు కషి చేస్తున్న సత్యప్రభ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, రాజన్న యువసేన సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కోటనందూరు

ఖరీఫ్ వరి పంటల సాగుపై వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి పెద్దాపురం ఎడిఎ భ్రమరాంబిక ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భ్రమరాంబిక మాట్లాడుతూ భూసారాన్ని బట్టి రైతులు ఏ రకమైన విత్తనాలను వెయ్యాలి అనే దానిపై రైతులుకు అవగాహన కల్పించాలని, విత్తన శుద్ధి విధానాన్ని రైతులకు నేర్పించాలని, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారుమళ్లలో పెంట వేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి రైతులకు మెలకువలు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారి శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న భ్రమరాంబిక

ధాన్యం వ్యాపారి నుంచి రూ.6 లక్షల చోరీ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ధ్యానం వ్యాపారి నుంచి రూ.6లక్షలు నగదు చోరీ చేసి పరారయ్యారు. స్థానిక కొండప్ప వీధికి చెందిన ఎన్.నారాయణమూర్తి ధాన్యం వ్యాపారం చేస్తుంటారు. రైతులకు డబ్బులు ఇచ్చేందుకు శుక్రవారం పట్టణంలోని ఎస్‌బిఐ నుంచి రూ.6 లక్షల నగదును డ్రా చేశాడు. ఈ నగదును బ్యాగ్‌లో పెట్టుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి పయనమయ్యాడు. సీతయ్య గారి తోట ప్రాంతంలోని హార్వెస్ట్ స్కూల్ వద్దకు వచ్చేసరికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. రూ.50 నోట్లు కిందపడిపోయాయి అంటూ నారాయణమూర్తికి తెలిపారు. కింద పడి ఉన్న డబ్బును తీసుకునే ప్రయత్నం చేసే సరికి నారాయణమూర్తి బండికి డబ్బులతో ఉన్న బ్యాగ్‌ను తీసుకుని వారు పరారయ్యారు. దీనిపై బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కార్యవర్గానికి పలువురి అభినందనలు

ప్రత్తిపాడు బార్ కౌన్సిల్ కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల నాలుగో తేదీన ఎన్నికలు జరిగినప్పటికీ అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులకు చెరో 33 ఓట్లు రావడంతో ఎన్నికలు నిలిపివేసి ఎపి బార్ కౌన్సిల్‌కు నివేదిక పంపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తరపున ఎగ్జిక్యూటివ్ సభ్యులు మురహరిశెట్టి రవికుమార్ హాజరైన అధికారులతో చర్చలు జరిపారు. మొదటి ఆరు నెలలు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, తరువాత ఆరు నెలలు రాజాల చిట్టిబాబు అధ్యక్షునిగా కొనసాగేందుకు రాజీ చేశారు. అందరి ఏకాభిప్రాయంతో నూతన దీక్షగా అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బొంగుళూరి మధుబాబు, ఉపాధ్యక్షునిగా రామణం వీర వెంకటరావు, కోశాధికారిగా జొన్నాడ రాజేష్, సహాయ కార్యదర్శిగా పలివెల నాగేంద్ర రాజు, స్పోర్ట్స్ కార్యదర్శిగా లింగంపల్లి శివకుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా బత్తుల రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చలంకూరి రామకృష్ణ, కొల్లా వీర్రాజు, చిట్టంశెట్టి పుల్లయ్య, బుగత శివన్నారాయణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

ఉపాధి కూలీలకు వేసవి సౌకర్యాలు కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని నీలాద్రిరావుపేట తాళ్లూరు గ్రామాల్లోఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలందరు కొలతలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 వేతనం పొందేలా పని చేయాలని, ఉదయం 5.30 గంటలకు హాజరై 10.30 గంటలకు పని ముగించాలని, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ రెండు లీటర్ల తాగునీరు కూడా తెచ్చుకోవాలని, తలమీద రుమాలు ఎండ తగలకుండా చుట్టుకోవాలని తెలిపారు. కొత్త పనులుంటే ప్రతిపాదించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఉపాధి కూలీల నమోదు హాజరు శాతాన్ని మస్తర్లను తనిఖీ చేశారు. పీడీ వెంట ఎపిఒ గంగా భవాని, టిఎలు, ఎఫ్ఎలు ఉన్నారు.

29 నుంచి భీమేశ్వరాలయంలో దర్శనాల నిలిపివేత

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట భీమేశ్వర స్వామి వారి ఆలయంలో యోగా లింగానికి జీర్ణోద్ధారణ మరమ్మతుల పనుల నేపథ్యంలో ఈనెల 29 నుంచి జూన్ 8వరకూ దర్శనాలను నిలిపి వేస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ల నీలకంఠం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని పది రోజులు పాటు జాతీయ పురావాస్తు శాఖకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. పురావాస్తు శాఖ, రాష్ట్ర దేవాదాయ శాఖల ఉత్తర్వుల మేరకు ఈ పది రోజుల పాటు భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారల ఉత్సవ విగ్రహాలకు ఆలయ నంది మండపంలో పూజలు నిర్వహించి భక్తులకు అక్కడే దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ముంపు నివారణ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర ముంపు నివారణకు జిల్లా యంత్రాంగం యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కాకినాడ నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి క్లాస్ మాస్ ఏరియా తేడా లేకుండా స్మార్ట్ సిటీ సర్వం పూడిక ముంపు జలాలతో తల్లడిల్లిందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేషన్ వేసవి ఎండల ప్రారంభంలో చేయాల్సిన పూడిక తొలగింపు, తరలింపు పనులను మే నెలాఖ రులో చేపట్టడం వలన లక్షలాది రూపాయల నిధులు మురుగు పాలయ్యాయన్నారు. వీధి కాలువల్లో తీసిన పూడిక ఎక్కడిది అక్కడే ఉండి పోయిందన్నారు. వ్యర్థాల తరలింపు జరగలేదన్నారు. ప్రధాన రహదారుల్లో ఆర్ అండ్ బి క్రాస్ కల్వర్టుల దిగువ క్లీనింగ్ జరగలేదన్నారు. అవుట్ లెట్స్ క్లియరెన్స్ నిర్వహించ లేదన్నారు. రేచర్లపేట రైల్వే డ్రైన్, పిడబ్ల్యూడి కాలువ, చీడీలపోర మేజర్ డ్రైన్స్, సినిమా రోడ్ కవర్ స్లాబ్ డ్రెయిన్లు, ఉప్పుటేరు కాలువ ప్రవాహాల అడ్డగింపు ప్రక్షాళన చేపట్టలేదన్నారు. కార్పోరేషన్ ఆర్థికమాంద్యంతో పౌర సౌకర్యాల ముందస్తు ప్రణాళికలు స్తంభించి పోయాయన్నారు. రెవెన్యూ, పిడబ్ల్యూడి, నీటిపారుదల, మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి తదితర శాఖల నడుమ సమన్వయం లేక ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

తాతపూడి లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పరదేశి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ పరదేశి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న జగనన్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా సరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అంగర ఎస్ఐ అందే పరదేశి హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సెక్షన్ 144, 30 ఉన్నాయన్నారు. జిల్లా ఎస్ పి ఆదేశానుసారం గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ శాంతి భద్రతలపై శుక్రవారం తాతపూడి గ్రామంలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని పోలీస్ శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో పోలీస్ ఇబ్బందితో కవాతు నిర్వహించారు. ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలకు ఏ విధమైన అనుమతులు లేవన్నారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

యుద్ధప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ అచ్చంపేట-ఉండూరు సమీపంలో పైపులైన్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె..వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్లే ముడినీటి సరఫరా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. వీటిని అరికట్టేందుకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో మరమ్మతు పనులు చేపట్టామన్నారు. 1 నుంచి 13వ డివిజన్ వరకు అంటే శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్, శ్రీనివాస బ్యాంక్‌కాలనీ, గైగోలుపాడు ప్రాంతాలకు నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులను చేపట్టామన్నారు. శుక్రవారం కురిసిన భారీవర్షం కారణంగా పైపులైన్ మరమ్మతు పనులకు అంతరాయం కలిగిందని, ఈ నెల 26, 27 తేదీల్లోనూ ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందిపడకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఆరు ట్యాంకర్లతోపాటు మరో ఆరు అద్దె ట్యాంకర్లను కూడా రప్పించామన్నారు. ఎక్కడైనా మంచినీరు సమస్య ఎదురైతే మొబైల్ నెంబర్లు 9849906507, 9959799138, 9676770461, 9848471415 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పల్లంకుర్రులో వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి-కాట్రేనికోన

బొబ్బర్లంక - పల్లంకురు ప్రధాన పంట కాలువలోకి రైస్ మిల్లు వద్ద శుక్రవారం డిసిఎం వ్యాన్ బోల్తా కొట్టింది. చెరువులో పట్టిన చేపలు తరలించేందుకు వచ్చిన ఈ వ్యాన్ అదుపుతప్పి పంటకాల్వలోకి బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్‌తోపాటు, వ్యాన్‌పై మరొక యువకుడు ఉన్నట్టు తెలిసింది. ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు.

కాలువలో బోల్తాపడిన వ్యాన్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా!
దినపత్రికలో పనిచేసేందుకు
క్రింద తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
రాజమండ్రి, రాజమండ్రి సిటీ, రాజమండ్రి క్రైం, రంగంపేట, అనపర్తి, రాయవరం, పి.గన్నవరం, రావులపాలెం, అల్లవరం, మలికిపురం, సఖినేటిపల్లి, మండపేట, కె.గంగవరం, కాకినాడ సిటీ, కాకినాడ క్రైం, గొల్లప్రోలు, తుని, తుని రూరల్, తొండంగి, ప్రత్తిపాడు
విలేకరులు కావలెను
ఇంటర్వ్యూ జరుగు తేదీ: ది.30-05-2024 మంగళవారం ఉదయం 10 గంటలకు
విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
స్థలం: ప్రజాశక్తి కార్యాలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, స్వరూప్‌నగర్ లాలాచెరువు, రాజమండ్రి
సంప్రదించాల్సిన నెంబర్లు 92918 01804, 94900 99169

ఇరిగేషన్ స్థలాల్లో కనుమరుగవుతున్న పచ్చని చెట్లు

ప్రజాశక-ఆత్రేయపురం

ఇరిగేషన్ స్థలాల్లో పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. ఇరిగేషన్ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరించడంతో రాత్రికి రాత్రే చెట్లు మాయవడంపై ప్రకతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆహ్లాదంగా ఉండే లొల్ల లాకులు పచ్చని చెట్లు కనుమరుగ అవడంతో ప్రకతి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇటీవల కాలంలో మెయిన్ కరెంట్ లైన్లు వేయడంతో వారికి అడ్డువచ్చిన చోట చెట్లు కొమ్మలను తొలగిస్తున్నారు ఇదే అదనగా కొంతమంది దుండగులు రాత్రికి రాత్రే చెట్లు నరికి వేస్తున్నారు ఉదయం చూసేటప్పటికి చెట్లు మాయమైపోతున్నాయి. ఒకపక్క పచ్చదనం కరిగిపోయి భూతాపం పెరిగిపోతుంది దీంతో కొద్దిపాటి ఎండకే ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో మధ్య డెల్టా పరిధిలోగల ప్రధాన లాకులు వద్ద సినిమా షూటింగులు ఎక్కువగా జరిగాయి. ఈ ప్రాంతమంతా పచ్చని చెట్లు కొనుమరుగయ్యాయి. ఇక్కడ పరిసర ప్రాంతాలు ప్రకతి హీనంగా తయారవడంతో రాను రాను షూటింగులు జరగడం లేదు. టూరిస్టులు రాక రోజురోజుకి తగ్గుతోంది. ఇరిగేషన్ మరియు విద్యుత్ శాఖ అధికారులను అడిగితే మేము ఎటువంటి చెట్లను తొలగించలేదంటూ చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని పచ్చని చెట్లను పరిరక్షించి పర్యావరణను పరిరక్షించాలని ప్రకతి కాపాడాలని పలువురు కోరుకుంటున్నారు.

అక్రమార్కులు నరికేసిన పచ్చని చెట్లు

బుద్ధ జయంత్యోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

ఈనెల 26న ఆదుర్రులో నిర్వహించే బుద్ధ జయంతోత్సవాల సంబంధించిన కరపత్రాన్ని అల్లవరంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సంఘ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వహణ కమిటీ ట్రెజరర్ ఉపాసక భయ్యా మోహనరావు మాట్లాడుతూ 26న ఉదయం 9 గంటల నుండి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు బత్తుల నకులరాజు ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నేరేడిమిల్లి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గెడ్డం ప్రదీప్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లమెంటరీ పరీక్షకు 594 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పదవ తరగతి సప్లమెంటరీ తెలుగు పరీక్షలకు సంబంధించి జిల్లాలో 987 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 393 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరైనట్లు శుక్రవారం డిఇఒ ఎం.కమల కుమారి తెలిపారు. జిల్లాలో వీరి కోసం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా 393 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 594 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 9 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేయగా డిఇఒ ఎం.కమల కుమారి 4, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ 3 పరీక్ష కేంద్రాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. కాగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికొన్నత పాటశాల కేంద్రంలో 64 మందికి 20 మంది విద్యార్థులు హాజరుకాగ 44 మంది గైర్హజరయ్యారని ఎంఇఒ బి.రమణశ్రీ తెలిపారు.

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో...
ఓ.ఎస్.నెం. 147/24

బిట్వీన్
కొవ్వూరి వీర్రాఘవరెడ్డి - వాది
తండ్రి పెద్దారెడ్డి, డో.నెం. 5-7/3, బలభద్రపురం గ్రామం, బిక్కవోలు మండలం,

మరియు

1) పాండ్రంకి వెంకన్న, -ప్రతివాదులు
తండ్రి సూర్యారావు, డో.నెం. 8-15, బలభద్రపురం, బిక్కవోలు మండలం
2) పాండ్రంకి కుమారి, భర్త వెంకన్న, డో.నెం. 8-15, బలభద్రపురం, బిక్కవోలు మండలం
3) పాండ్రంకి ప్రసాద్, తండ్రి వెంకన్న, డో.నెం. 8-15, బలభద్రపురం, బిక్కవోలు మండలం
4) సియాదుల మంగ, భర్త సియాదుల సత్తిబాబు, డో.నెం. 8-3, తాతానగరం, బలభద్రపురం, బిక్కవోలు మండలం

పబ్లిక్ నోటీస్

పై నెంబరు దావాలో 1 నుండి 3 ప్రతివాదులు వాది ప్రోనోటు బాకి ఎగవేయడానికి నాలుగవ ప్రతివాదికి యీ దిగువ షెడ్యూలు దాకల ఆస్తిని ప్రతిఫలం లేకుండా అన్యాయంగా బదిలిచేసినారు. ఇంకా ఎవరైనా 1 నుండి 3 ప్రతివాదుల బాకీదారులు ఎవరైన ఉన్నయెడల ది.15-7-2024 సం.తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ముందు స్వయముగా కాని, లాయరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.

షెడ్యూలు

తూ.గో.జిల్లా, బిక్కవోలు మండలం, బలభద్రపురం గ్రామం సర్వే నెం.261/1లో పాత 9బ్లాక్‌లో, కొత్త 8 బ్లాక్‌లో డో.నెం. 8-22 బంగాళ పెంకిటిల్లు 145 1/4 చ.గ.వున్న ఇంటికి సరిహద్దులు.
తూర్పు : 60 లింకులు శెట్టి బలిజ కొండయ్యగారి స్థలం
పడమర : 60 లింకులు 5 గ॥ వెడల్పు వీధి
ఉత్తరం : 50 లింకులు పాండ్రంకి సూరిబాబు గారి స్థలం
దక్షిణం : 50 లింకులు పాండ్రంకి అప్పారావు గారి స్థలం
సమస్త ఈజిమెంట్ హక్కులతో సహా
కోర్టువారి ఆర్డర్ మేరకు)

కె.వి.సుబ్బారెడ్డి
కె.భాను శిరీష,
వాది తరపు న్యాయవాదులు
అనపర్తి
23-05-2024
9949035905

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.A. No. 10/2022
E.A. No. 41/2021
E.P. No. 283/2008 in
O.S. No. 98/2003

Between:
Velugubanti Surya Chakram, W/o. Atchanna, Hindu, aged 50 years, Gokavaram V & Mandal.
...Petitioner/ Decree Holder
AND
Chintala Gangamma @ Parvathi (died) and Others ***...Respondents/ JDrs***
3. Chintala Appa Rao, S/o. Dalayya, Hindu, aged 65 years, Velampeta, Gokavaram V & Mandal.
4. Chintala Baburao (died) his wife Chintala Ramana, Hindu, aged 55 years, West Gonagudem, Near Electricity Office, Korukonda Mandal.
5. Reddy Ramana (died) W/o. Reddy Veerraju, Husband of deceased Ramana, Velampeta, Gokavaram, Gokavaram (M), Hindu, aged 45 years, Gokavaram.
6. Chintala Satyanarayana (died) wife of Chintala Kumari, Hindu, aged 40 years, Dasari vari Veedhi, Gokavaram, Gokavaram Mandal.
...3, 4, 5, 6 Respondents/ JDrs

పై నెంబరు గ్రంథంలో 3, 4, 5, 6 రెస్పాండెంట్స్/ జె.డి.ఆర్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 19-6-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు గ్రంథంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సలాది శ్రీనివాసరావు
అడ్వకేట్, రాజమండ్రి
రాజమండ్రి
24-5-2024
సెల్: 9849197731